
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



టమాట కిలో రూ.24
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.24, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.16 ప్రకారం ధర పలికింది.



టన్ను చీనీ రూ.16 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.4°/23.2°
జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఉషశ్రీచరణ్



పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా పెనుకొండ నియోజక వర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ, తన ఎంపికకు సహకరించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో అన్ని నియోజవర్గాల్లోని సమన్వయకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే అనంతపురం జిల్లా పార్టీ నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని నియమించారు.

అందుబాటులో 13,634 టన్నుల ఇసుక

ప్రశాంతి నిలయం: జిల్లాలోని ఉప్పలపాడు, నల్లబోయినపల్లి, కొడవాండ్లపల్లి రీచ్‌లలో 13,634 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు మైన్స్ అండ్ జియాలజీ ఏడీఈ రామమోహన్ తెలిపారు. మంగళవారం 1,455 మెట్రిక్ టన్నుల ఇసుక కోసం 89 దరఖాస్తులు అందాయన్నారు. మూడు రీచ్‌లలో టన్ను ఇసుక ధర రూ.277గా నిర్ణయించినట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరు మండలాల్లో వర్షం



ప్రశాంతి నిలయం: వాతావరణ మార్పులతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో 40.8 మి.మీ వర్షం కురిసింది. అత్యధికంగా కనగానపల్లిలో 13.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక బత్తలపల్లి మండలంలో 12.2 మి.మీ, ధర్మవరం 4.6, రొళ్ల 4.4, గుడిబండ 3.4, తాడిమర్రి మండలంలో 3.0 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

జిల్లాకు వర్షసూచన
రాగల ఐదు రోజులూ జిల్లాకు తేలిక పాటి వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 34.0 – 35.0 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

ఈ-క్రాప్ సకాలంలో పూర్తి చేయాలి
- జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

నల్లమాడ: ఈ-క్రాప్ నమోదు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) సుబ్బారావు సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం ఆయన, రెడ్డిపల్లి, వేళ్లమద్ది, దొన్నికోట గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

సందిగ్ధం.. సేవకుల భవితవ్యం!

వలంటీర్ల కొనసాగింపుపై కొరవడిన స్పష్టత

ఓ వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)



'వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రాజకీయం చేస్తున్నారు. మేమే మీకు అన్ని సేవలు అందిస్తున్నాం... ఎన్నికల్లో మేము చెప్పినట్లే మీరు వినాలి అంటూ ప్రజల్ని మభ్య పెడుతున్నారు. ఇది కరెక్ట్ కాదు. అదే మాదిరిగా ప్రజల పర్సనల్ విషయాలు కూడా అడుగుతున్నారు. ఆ వివరాలతో వీరికేం పని?'

– 2022లో వలంటీర్లపై చంద్రబాబు చేసిన ఆరోపణ ఇది.

'వలంటీర్లలో చాలా సమర్థత ఉంది. వీరు చాలా తక్కువ వేతనంతో పని చేస్తున్నారు. అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతాం. వలంటీర్ వ్యవస్థను కొనసాగించే బాధ్యత నేను తీసుకుంటా'.

– 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ ఇది.

ఒకటో తేదీ పొద్దున్నే నిద్రలేపి మరీ పింఛన్ ఇచ్చే ఆత్మీయ నేస్తం కనిపించడం లేదు. రేషన్ కార్డు కావాలన్నా.. ఆధార్ అప్డేట్ చేయించాలన్నా.. బర్త్ సర్టిఫికెట్ కావాలన్నా క్షణాల్లో చేసిపెట్టే ఆ ప్రజాసేవకుడి జాడ కరువైంది. కష్టంలో తోడుగా నిలిచే ఆత్మబంధువుకు ఆపదొచ్చింది. గత ఐదేళ్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలిచిన వలంటీర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తుందా?.. తొలగిస్తుందా? ఇపుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. విజయవాడ వరదల సందర్భంగా వలంటీర్ వ్యవస్థ మరోసారి వార్తల్లో నిలిచింది.

- వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామంటూ గతంలో చంద్రబాబు హామీ
- అధికారం చేపట్టిన తర్వాత ఆ ఊసే ఎత్తని కూటమి సర్కార్
- 5 నెలలుగా వేతనాలు అందక వలంటీర్ల అగచాట్లు



456
జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలు

9,500
గతంలో ఉన్న వలంటీర్లు

2,980
ప్రస్తుతం ఉన్న వలంటీర్లు

5 నెలలు
వలంటీర్లకు వేతనం బకాయి

చర్చనీయాంశమైన వలంటీర్
జల విలయంలో చిక్కుకున్న విజయవాడలో సకాలంలో కనీసం భోజనం ప్యాకెట్లు అందక జనం అల్లాడిపోతున్నారు. ఈ సమయంలో అందరూ కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు తలచుకుంటున్నారు. వలంటీర్లు ఉండి ఉంటే తమకీ కష్టాలు వచ్చేవి కాదని విజయవాడ వాసులు చెబుతున్న తీరుతో రాష్ట్రమంతా ఇపుడు మరోసారి వలంటీర్లపై చర్చ నడుస్తోంది.

కదిరి: రాష్ట్రంలో వైఎస్ జగన్ సర్కార్ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసింది. అంతేకాకుండా ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రజల ముంగిళ్లలోనే సేవలందించారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా వలంటీర్లు తమ బాధ్యతను చక్కగా నిర్వర్తించారు. ముఖ్యంగా 1వ తేదీ సూర్యోదయం కాక ముందే వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్ మొత్తం వారికి అందజేసేవారు. అలాగే ఏ ఒక్కరూ సచివాలయం వరకూ వెళ్లకుండా వలంటీర్లే అన్ని పనులు చేసిపెట్టేవారు. కానీ రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక వలంటీర్ల ఉనికి ప్రశ్నార్థకమైంది.

తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వేతనం రూ.10 వేలకు పెంచుతామంటూ వారిలో ఆశలు రేపి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక వలంటీర్లను పూర్తిగా విస్మరించారు. వారి బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. ఈ క్రమంలో వలంటీర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపే ఆలోచనలో ఉన్నామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటన వలంటీర్లను మరింత గందరగోళానికి గురి చేసింది.

ప్రశ్నార్థకంగా 9 వేల మంది భవితవ్యం
గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 456 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో 9,500 మంది వలంటీర్లు ఉండేవారు. వీరంతా నెలకు రూ.5 వేల గౌరవ వేతనంతోనే తమ సేవలు కొనసాగిస్తూ వచ్చారు. పింఛన్ల పంపిణీతో పాటు కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, కుళాయి పన్నుల చెల్లింపు ఇలా ప్రతి విషయంలోనూ ప్రజలకు చేదోడు వాదోడుగా నిలిచారు. కోవిడ్ సమయంలోనూ వలంటీర్లు చేసిన సేవలకు రాష్ట్ర ప్రజానీకం చేతులెత్తి దండం పెట్టింది. కుటుంబ సభ్యులు కూడా అందించలేని ఎన్నో విలువైన సేవలను విపత్కర కాలంలో వారు అందించారు. ఏ ఇంట్లో ఎవరికి ఏ సాయం కావాలన్నా... వలంటీర్లే దగ్గరుండి చూశారు. పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకూ ఎవరికి ఏ సర్టిఫికెట్ కావాలన్నా వలంటీర్లే ఆయా పనులను చక్కబెట్టారు. అలాంటి వలంటీరు వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ కూటమి ప్రభుత్వం పావులు కదిపింది. వలంటీర్లను కొనసాగించే అంశంపై ఇప్పటి వరకూ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. వలంటీర్లపై తమ వైఖరేంటో కూడా కూటమి ప్రభుత్వం చెప్పలేదు.

దూషించిన నోటితోనే పొగడ్తలు
వలంటీర్లను ఎన్నికలకు ముందు ఎన్నోసార్లు కూటమి నేతలు దూషించారు. వారిపై ఎన్నో నిందలు మోపారు. 'ఏమి ఉద్యోగమయ్యా అది. గోనె సంచులు మోసేది కూడా ఒక ఉద్యోగమేనా?. ఇళ్లలో మగోళ్లు లేనప్పుడు తలుపులు కొట్టేది. అదేగా మీరు చేస్తున్న ఉద్యోగం' అంటూ చంద్రబాబు దారుణమైన వ్యాఖ్యలు చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ అయితే..'రాష్ట్రంలో కొన్ని వేల మంది అమ్మాయిల మిస్సింగ్‌కు కారణం వలంటీర్లే' అంటూ అభాండాలు వేశారు. కానీ ఎన్నికలు సమీపించగానే కూటమి నేతలు వలంటీర్లపై ప్రశంసల వర్షం కురిపించారు. తిట్టిన నోటితోనే పొగడటం మెదలెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని హామీ కూడా ఇచ్చారు. ఈ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలోనూ పెట్టారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ ఆ హామీలకు అతీగతీ లేదు. ఇప్పటికే జిల్లాలోని దాదాపు 6 వేల మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తప్పుకోగా, ఉన్న వారి గురించి ఈ ప్రభుత్వం కనీస ప్రకటన చేయలేదు. దీంతో వారంతా సందిగ్ధంలో పడ్డారు.



మహిళకు రేషన్‌కార్డు అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి



తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీనిచ్చారు. అలాగే జీతం కూడా నెలకు రూ.10 వేలు ఇస్తామన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుని తక్షణం వలంటీర్లను కొనసాగిస్తూ రూ.10 వేల జీతం చెల్లించాలి.

– ప్రశాంత్, వెలిచెలమల, ఎన్పీ కుంట మండలం

మమ్మల్ని కొనసాగించాలి



రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ తక్షణం ఉత్తర్వులు జారీ చేయాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ల వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలి. అప్పుడే ఈ ప్రభుత్వానికి విశ్వసనీయత ఉందని ప్రజలు నమ్ముతారు.

– పి.ఉపేంద్ర, ఉప్పార్లపల్లి, నల్లచెరువు మండలం

న్యాయం చేయాలి



ఎన్నికలకు ముందు చంద్రబాబు వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. అధికారంలోకి వచ్చాక రూ.10 వేతనం ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో చాలామంది ఆశపడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇప్పటికీ వలంటీర్ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడం బాధాకరం. తక్షణం ప్రభుత్వం దీనిపై స్పందించాలి. వలంటీర్లకు న్యాయం చేయాలి.

– ఆత్మారెడ్డి, ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర నాయకులు

ఉద్యాన పంటలతో అధిక లాభాలు

- కలెక్టర్ టీఎస్ చేతన్



నాగులూరు వద్ద అల్లనేరేడు పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం రూరల్/బత్తలపల్లి: ఉద్యాన పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం కూడా రాయితీలు ఇస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మంగళవారం కలెక్టర్ ధర్మవరం మండల పరిధిలోని నాగులూరు వద్ద రైతు వెంకటేశ్వరరెడ్డి సాగు చేసిన మామిడి, అల్లనేరేడు తోటలను, టమాట, గోంగూర, మునగ, మిరప తదితర అంతర పంటలను పరిశీలించారు. అనంతరం బత్తలపల్లి మండలంలోని దాదాసాహెబ్, హిదయతుల్లా సాగు చేసిన చీనీ తోటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రైతులతో కలెక్టర్ చేతన్ మాట్లాడారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు అనుకూల వాతావరణం ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై డ్రిప్ అందిస్తోందని, దీని ద్వారా సాగునీరు ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన తోటల్లో అంతర పంటలు సాగు చేస్తున్న ధర్మవరం మండలానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, తాను పది ఎకరాల్లో ఎంఐడీహెచ్ పథకం ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌తో అంతర పంటలను సాగు చేస్తున్నానన్నారు. దీనివల్ల అదనపు ప్రయోజనం ఉందన్నారు. అలాగే బత్తలపల్లి మండలానికి చెందిన దాదాసాహెబ్ మాట్లాడుతూ, ఉద్యాన అధికారుల సహకారంతో మూడున్నర ఎకరాల్లో తాను చీనీతోట సాగుచేశానని, చీనీ ద్వారా పెట్టుబడులు పోను రూ.50 వేల దాకా ఆదాయం వచ్చిందని తెలిపారు. కలెక్టర్ వెంట డివిజన్, మండల ఉద్యానశాఖ, మైక్రో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రూ.కోట్లు కొట్టేసిన మోసగాడి అరెస్టు

- సిగరెట్లు, చక్కెర తక్కువ ధరకు ఇస్తానంటూ టోకరా
- వ్యాపారంలో పెట్టుబడి పేరుతో పలువురి నుంచి డబ్బు వసూలు
- రాత్రికి రాత్రి బిచాణా ఎత్తేసిన బెస్త ఓబులేసు
- అరెస్టు చేసిన నల్లచెరువు పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీలత

నల్లచెరువు: తక్కువ ధరకే సిగరెట్లు, చక్కెర సరఫరా చేస్తానంటూ మండలంలోని పలువురు దుకాణదారుల నుంచి వసూళ్లు చేయడంతో పాటు తన వ్యాపారంలో పెట్టుబడి పెడితే భారీగా లాభాలు ఉంటాయని నమ్మించి రూ.కోట్లు వసూలు చేసిన మోసగాడు బెస్త చిన్న ఓబులేసు అలియాస్ ఉమా మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కదిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ శ్రీలత విలేకరులకు తెలిపారు.

దుకాణదారులతో మాట కలిపి
నార్పల మండలానికి చెందిన బెస్త చిన్న ఓబులేసు అలియాస్ ఉమా మహేశ్వర్‌రెడ్డి నల్లచెరువులో ఓ గది అద్దెకు తీసుకున్నాడు. ఓ కారు తీసుకుని డ్రైవర్‌గా నల్లచెరువు మండలం దేవిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపల్లి బావాజీని నియమించుకున్నాడు. అనంతరం స్థానికంగా ఉన్న పలు దుకాణదారులతో మాట కలిపాడు. తాను తక్కువ ధరకే చక్కెర, సిగరెట్లు తెప్పిస్తానని నమ్మబలికాడు. తనకు అడ్వాన్స్ ఇస్తే సరుకు సరఫరా చేస్తానన్నాడు. అంతేకాకుండా వారిని నమ్మించేందుకు ఓ దుకాణదారుడికి రూ.2,060 చక్కెర బస్తాను రూ.1,800లకే అందజేశాడు. అలాగే నల్లచెరువు గ్రామస్తుడు లక్ష్మీపతి దుకాణానికి 100 మూటల చక్కెర, 70 బండిళ్ల సిగరెట్లు తక్కువ ధరకు అందించాడు. దీంతో మిగతా దుకాణదారులంతా తమకూ సరుకు కావాలని చిన్న ఓబులేసుకు అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో తన వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని మరికొందరికి ఆశ పెట్టాడు. ఇప్పటికే తనతో కలిసి వ్యాపారం చేసిన వారికి భారీగా లాభాలు వచ్చాయని రికార్డులు చూపాడు. దీంతో నల్లచెరువు గ్రామంలో ఒక వ్యక్తి పెట్టుబడి నిమిత్తం రెండు విడతలుగా చిన్న ఓబులేసుకు రూ.90 లక్షలు, అలాగే మరో వ్యక్తి విడతల వారీగా రూ.41 లక్షలు ఇచ్చారు. మరికొందరు వ్యాపారులు కూడా భారీగా నగదు అందజేశారు. ఇలా మొత్తంగా రూ.2.27 కోట్లు వసూలు చేసుకున్న చిన్న ఓబులేసు అందులో కొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టిన వారికి లాభాల కింద ఇచ్చి వారికి నమ్మకం కలిగించాడు. అలా పలువురి నుంచి డబ్బులు తీసుకోవడం, అప్పటికే వసూలు చేసిన వారికి లాభం కింద కొంతమొత్తం ఇవ్వడం చేస్తూ వచ్చాడు. రానురాను పెట్టుబడిదారులు తమకు అసలు కూడా ఇవ్వాలని కోరగా ఒత్తిడి పెరిగింది. దీంతో చిన్న ఓబులేసు జూలై 23వ తేదీన తన డ్రైవర్ రెడ్డిపల్లి బావాజీతో కలిసి మాయమయ్యాడు. అనంతరం వారిద్దరూ గోవాకు వెళ్లి అక్కడ జల్సాలు చేశారు. చిన్న ఓబులేసు కనిపించపోయే సరికి తాము మోసపోయామని గ్రహించిన బాధితులు నల్లచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కదిరి సీఐ నాగేంద్ర సూచనలతో దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఐ లింగన్న మంగళవారం నిందితులు చిన్న ఓబులేసు, బావాజీలను నల్లచెరువు మండల పరిధిలోని చక్రపాణి ధాబా వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి రోల్డుగోల్డు చైను, చేతి కడియం, నాలుగు ఉంగరాలు, రెండు రిజిష్టర్లు, రూ.460 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.

గతంలోనూ కేసులు
చిన్న ఓబులేసుపై గతంలోనూ అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సుమారు 24 చీటింగ్, చోరీ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు. కొన్ని కేసుల్లో జైలుకు వెళ్లిన చిన్న ఓబులేసు బెయిల్‌పై విడుదలైన తర్వాత యథావిధిగా ప్రజలను మోసం చేస్తూ వస్తున్నాడని డీఎస్పీ శ్రీలత వెల్లడించారు.



అధినేత జగన్‌తో భేటీ

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో జిల్లాకు చెందిన పార్టీ నేతలు కలిశారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా జగన్ వారికి దిశానిర్దేశం చేశారు. టీడీపీ గూండాల దాడుల్లో గాయపడిన కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు. జగన్‌ను కలిసిన వారిలో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శాంతమ్మ, మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్, హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు ఉన్నారు.

● సాధన షురూ



సాధన చేస్తున్న అర్షదీప్ సింగ్

దులీప్ ట్రోఫీలో భాగంగా మ్యాచ్‌లు ఆడేందుకు అనంతపురం చేరుకున్న క్రీడాకారులు సాధన ప్రారంభించారు. ఆర్డీటీ క్రీడా గ్రామంలో మంగళవారం చెమటోడ్చారు. స్టార్ క్రికెటర్లు రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, అర్షదీప్ సింగ్, సాయిసుదర్శన్ తదితరులు తీవ్రంగా శ్రమించారు. ఈ నెల 5వ తేదీ నుంచి క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. 22 వరకూ జరగనున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



వ్యాయామం చేస్తున్న క్రీడాకారులు



సాధనలో శ్రేయస్ అయ్యర్

క్లుప్తంగా

వెండి రథంపై ఖాద్రీశుడు



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి వెండి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

నల్లచెరువు: వైఎస్సార్ జిల్లా కడపలోని ఓ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న నల్లచెరువు మండలం బంట్రేపల్లికి చెందిన నందిని కనిపించకుండా పోయింది. గత నెల 28న కళాశాల నుంచి ఇంటికి వస్తున్నట్లు ఫోన్ చేసి బయలుదేరిన ఆమె ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసులకు నందిని తండ్రి ఓబులరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

జ్వరంతో చిన్నారి మృతి



చిన్నారి దేవా

పుట్టపర్తి టౌన్: పట్టణంలో తీవ్ర జ్వరంతో ఐదేళ్ల చిన్నారి దేవా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ..మునిసిపాలిటీలోని రెండో వార్డుకు చెందిన వలంటీర్ రమణ, అనూష దంపతుల కుమారుడు దేవా. ఇంటికి సమీపంలోని సాయి గీత ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం వచ్చింది. తల్లిదండ్రులు స్థానిక సత్యసాయి జనరల్ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. అయినా తగ్గకపోవడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

పారిశుధ్య లోపం వల్లే..

మునిసిపల్ ఆరోగ్య సిబ్బంది సరిగా పనిచేయకపోవడంతో పట్టణంలో పారిశుధ్యం లోపించిందని, ఫలితంగా పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. తీవ్ర జ్వరంతో మృతి చెందిన చిన్నారి దేవా ఇంటికి కేవలం వంద మీటర్ల దూరంలోనే పాఠశాల ఉంది. పాఠశాల సమీపంలో రెండు రోజులుగా మురుగు కాలువ పొంగి ప్రవహిస్తోంది. పాఠశాల యజమానులు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పట్టణమంతా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

బడి ఆవిష్కరణలకు వేళాయె..

విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరిలోని సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏటా 'ఇన్‌స్పైర్ మనక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిస్తూ పోటీలను నిర్వహించి ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులను అందజేస్తోంది. ఈ ఏడాది ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్ట్‌ల రూపకల్పనకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. 6 నుంచి పదో తరగతి వరకూ ఐదు ప్రాజెక్టుల నమోదుకు అవకాశం కల్పించారు.

- బాల శాస్త్రవేత్తలను గుర్తించేందుకు అన్వేషణ ప్రారంభం
- ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల రూపకల్పనకు దరఖాస్తుల ఆహ్వానం
- 6 నుంచి 10 తరగతి వరకు ఐదు ప్రాజెక్ట్‌ల నమోదుకు అవకాశం



2023లో జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్ట్‌తో రూపకర్త కనగానపల్లి మండలం తగరకుంట గ్రామ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి వంశీకుమార్, గైడ్ టీచర్ శివయ్య (ఫైల్)

అగళి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లోని శాస్త్రీయ నైపుణ్యం వెలికితీసేందుకు 'ఇన్‌స్పైర్ మనక్' వేదికగా నిలుస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక సమస్యలకు భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం పరిష్కారం చూపుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణల చేపట్టేలా ప్రోత్సహిస్తోంది. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆమోదంతో నామినేషన్లను గైడ్ టీచర్ సహకారంతో సెప్టెంబర్ 15 లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆలోచనను ఆవిష్కరణ రూపంలోకి తెచ్చేందుకు ప్రతి ప్రాజెక్టుకు రూ.10వేల చొప్పున సంబంధిత విద్యార్థి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. జిల్లా స్థాయిలో 10 శాతం ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వాటిలో పది శాతం జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమంగా నిలిచే 60 నమూనాలను రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించే అవకాశం దక్కుతుంది. ఒక్కో జాతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.20వేల చొప్పున నగదు పురస్కారం అందిస్తారు. అంతేగాక రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు దేశంలోని ప్రతిష్టాత్మకమైన పరిశోధన కేంద్రాలను సందర్శించే అవకాశాన్ని కల్పిస్తారు.

తరగతికి ఒకటి చొప్పున

ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు సంబంధించి ఆరు నుంచి పదో తరగతి వరకూ తరగతికి ఒకటి చొప్పున మొత్తంగా ఐదు ప్రాజెక్ట్‌లు నమోదు చేసుకునే అవకాశం ఉంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. తాము ఉంటున్న పరిసరాలు, అధ్యయనం చేసిన అంశాలు, సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రాజెక్ట్‌లను రూపొందించాల్సి ఉంటుంది. ప్రధానంగా డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛ భారత్, మేక్ ఇన్ ఇండియా, క్లీన్ ఇండియా, సమాజాభివృద్ధి అంశాల ఆధారంగా ప్రాజెక్ట్‌లకు రూపకల్పన చేయాలి.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత, సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు విద్యార్థులను సమాయత్తం చేయాలి. ఇందులో గణిత, సైన్స్ ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకం. జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా ప్రాజెక్ట్‌లకు రూపకల్పన చేయాలి.

– తనోజ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి

ఇప్పటి వరకూ జిల్లా నుంచి...

జిల్లా పరిధిలో 400 ప్రభుత్వ పాఠశాల, 300 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటి నుంచి గత విద్యా సంవత్సరం 973 ప్రాజెక్టులు నమోదు కాగా, 221 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యాయి. 2024–25 విద్యాసంవత్సరానికి గాను గత ఏడాది కంటే ఎక్కువ ప్రాజెక్ట్‌లో నమోదయ్యే అవకాశముంది. ఈ క్రమంలో ఇప్పటికే ఆయా పాఠశాలల్లో సైన్స్, మ్యాథ్స్ టీచర్లు విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

ప్రాజెక్టులను పంపండిలా...

ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించాలనుకుంటే పాఠశాల లాగిన్ ద్వారా https://www.inspireawards&dst.gov.in/ వెబ్‌సైట్‌లో సంబంధిత విద్యార్థుల ప్రాజెక్ట్‌ల వివరాలు నమోదు చేయాలి. ఎంపికైన వాటిని జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించేందుకు వీలు కల్పిస్తూ ప్రాజెక్ట్ రూపకల్పనకు రూ.10వేలను సంబంధిత విద్యార్థి బ్యాంక్ ఖాతాలోకి ప్రభుత్వం నేరుగా జమ చేస్తుంది. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వారు జాతీయ స్థాయిలో ప్రదర్శనకుగాను రూ.25 వేల పారితోషకాన్ని అందజేస్తుంది. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్‌కు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంది.

ఆటోను ఢీకొన్న బస్సు





చికిత్స పొందుతున్న నవిత, గంగరత్నమ్మ

నల్లమాడ: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం పుట్టగుండ్లపల్లికి చెందిన నవిత, గంగరత్నమ్మ, స్వాతి మంగళవారం ఉదయం నల్లమాడ మండలం కొత్తపల్లి తండాకు చెందిన ప్రశాంత్ నాయక్ ఆటోను అద్దెకు మాట్లాడుకుని రెడ్డిపల్లి ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లారు. తిరిగి అదే ఆటోలో స్వగ్రామానికి వెళుతూ నల్లమాడలోని సత్యమ్మ కూడలి వద్దకు చేరుకోగానే కదిరికి వెళ్తున్న పుట్టపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఘటనలో నవిత రెండు కాళ్లు, గంగరత్నమ్మ కుడికాలు విరిగాయి. స్వాతి, ఆటో డ్రైవర్ ప్రశాంత్‌నాయక్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు నల్లమాడలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డిపో మేనేజర్ ఇనాయతుల్లా, అసిస్టెంట్ డీఎం పెద్దన్న ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఘటనపై బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడకశిర: మండలంలోని ఎం.రంగాపురం సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు మడకశిర రూరల్ సీఐ రాజ్ కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం రంగనాథ స్వామి ఆలయం వద్ద తనిఖీలు చేపట్టగా పోలీసులను గమనించి పలువురు పరారయ్యారన్నారు. పట్టుబడిన ఆరుగురిని నుంచి రూ.55,400 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నామన్నారు. అలాగే పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు సికిందర్

అమరాపురం: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురం మండలం హేమావతికి చెందిన అలీసాహెబ్ కుమారుడు సికిందర్ (32) చికెన్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్నికి చేదోడుగా ఉండేవాడు. గ్రామంలో మారెమ్మ పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం హెల్పర్ జహీరుల్లాతో కలసి షాపులో చికెన్ కొట్టి ఇస్తున్నాడు. ఈ క్రమంలో కోడి బొచ్చు తీసే యంత్రంలో వ్యర్థాలు నిండుకోవడంతో శుభ్రం చేసేందుకు చెయ్యి పెట్టాడు. అయితే అప్పటికే యంత్రానికి విద్యుత్ ప్రసారం జరుగుతుండడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, మృతుడికి భార్య తస్మియ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జనార్దననాయుడు తెలిపారు.

బసంపల్లిలో తెగని శ్మశాన వాటిక స్థల వివాదం



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మాల కాలనీ వాసులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లిలో దళితుల శ్మశాన వాటిక స్థల వివాదం కొనసాగుతోంది. కొన్నేళ్లుగా ఈ సమస్యకు అధికారులు సైతం పరిష్కారం చూపడం లేదంటూ దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన నాగన్న మృతి చెందడంతో శ్మశాన వాటికలో ఖననం చేసేందుకు మృతుడి బంధువులు సిద్ధమయ్యారు. ఆ సమయంలో మరో కులానికి చెందిన వారు అడ్డుకుని తమకు చెందిన శ్మశాన వాటికలోకి ఎవరూ రాకూడదంటూ ఆక్షేపించారు. ఈ విషయంపై అప్పట్లో కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, సీకేపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనురాధ మంగళవారం బసంపల్లికి చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఇరు వర్గాల వారు అక్కడికి చేరుకుని అధికారుల ముందే వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో అధికారుల సమక్షంలోనే శంకరనారాయణ, వెంకటలక్ష్మమ్మ, వరలక్ష్మి, ఆనంద్ కులం పేరుతో దూషిస్తూ దాడికి ప్రయత్నించడంతో మాల కాలనీవాసులు చెన్నేకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్కేయూలో రేపు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

అనంతపురం: ఈ నెల 5న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బొటనీ, జువాలజీ విభాగంలో అకడమిక్ కన్సెల్టెన్సీ ఎంపికకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి మంగళవారం తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. పూర్తి వివరాలకు సంబంధిత విభాగాధిపతులను సంప్రదించవచ్చు.

రెచ్చిపోయిన టీడీపీ గూండాలు

- వైఎస్సార్‌సీపీ నాయకులపై కర్రలు, రాళ్లతో దాడి
- మహిళా సర్పంచ్, ఆమె భర్తను చితకబాదిన వైనం
- పగిలిన ముగ్గురి తలలు

రాయదుర్గం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ గూండాల ఆగడాలకు అంతు లేకుండా పోయింది. అధికారం మాది.. ఆధిపత్యం మాదేనంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. మంగళవారం రాత్రి డి.హీరేహాళ్ మండలం కల్యం గ్రామంలో టీడీపీ నాయకులు సాగించిన దాడులతో యుద్ధవాతావరణం నెలకొంది. పలువురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. వివరాలు...

కవ్వించి.. కాలు దువ్వి

కల్యం గ్రామానికి చెందిన బొమ్మ లింగన్న (70) మంగళవారం సాయంత్రం రోడ్డును దాటుతుండగా లారీ ఢీకొంది. ఆ సమయంలో గ్రామస్తులంతా అక్కడ గుమికూడారు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న టీడీపీ నాయకులు వారిని అడ్డుకున్నారు. మాటలతో కావాలనే కవ్వింపు చర్యలకు దిగారు. తామే ఆస్పత్రికి తీసుకెళతామని, ఈ అంశంలో ఎవరి ప్రమేయం ఉండరాదంటూ వాగ్వాదానికి దిగారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన వృద్ధుడు రోడ్డుపైనే ప్రాణాలు కోల్పోయాడు. ఇదే అదనుగా టీడీపీ గూండాలు మరింత రెచ్చిపోయారు. మానవత్వంతో వ్యవహరించి వృద్ధుడు ప్రాణాలు కాపాడాల్సింది పోయి కవ్వింపు చర్యలకు దిగడం సబబు కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. దీంతో మరింత రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ నేతలు ఆనంద్, కుమార్, శివన్న, ఓబులేసు, మౌనిక, మీనాక్షి, లక్ష్మిపై టీడీపీ గూండాలు పరమేశ్వరప్ప, అంగడి రాజు, లక్ష్మీపతి, చంద్ర, హనుమేష్, గంగాధర, ఓబులేసు, కుమారస్వామి, జయరాం, గంగన్న, రుద్రప్ప, అజయ్‌తో పాటు మరికొందరు ముకుమ్మడిగా దాడి చేశారు. కర్రలు, రాళ్లతో కొడుతూ తరుముకెళ్లారు. ఇళ్లలోకి చొరబడి భయానక వాతావరణం సృష్టించారు. ముగ్గురి తలలు పగిలాయి. మరో యువకుడి కన్ను పోయింది. అడ్డుకున్న మహిళా సర్పంచ్ పుష్పవతి, ఆమె భర్త వాల్మీకి నాగరాజును సైతం ఇంట్లో దూరి చితకబాదారు.

సకాలంలో స్పందించని పోలీసులు

టీడీపీ నాయకులు గంటల పాటు స్వైరవిహారం చేస్తున్న సమయంలో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయినా పోలీసులు ఆలస్యంగా అక్కడకు చేరుకుని బాధితులు, క్షతగాత్రులనే గద్దిస్తూ బెదిరింపులకు దిగారు. ఘర్షణలో మహిళల మెడల్లోని సుమారు పది తులాలకు పైగా బంగారు మంగళసూత్రాలు తెగిపడ్డాయి. ఘర్షణ అనంతరం వాటి కోసం ఎంత వెతికినా దొరకలేదు. దాడులు జరుగుతున్నంత సేపు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ కాలం గడపాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి భయానక వాతావరణాన్ని గతంలో తామెన్నడూ చూడలేదన్నారు. కాగా, ఘర్షణలో ముగ్గురు టీడీపీ నేతలకు కూడా గాయాలయ్యాయని, ఈ అంశంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ గురు ప్రసాదరెడ్డి తెలిపారు. గ్రామంలో పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు వివరించారు.


ఫ్లోర్ బాల్ పోటీల్లో రాణించిన బుక్కపట్నం విద్యార్థులు



రన్నరప్ సాధించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

పుట్టపర్తి: ఈ నెల 1న జరిగిన నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాణించి రన్నర్స్‌గా నిలిచారు. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, పీడీ నాగరాజు మంగళవారం తెలిపారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సాయి ప్రశాంతరెడ్డి, నరేంద్ర, విష్ణు, కిషోర్, వర్దన్, లోకేష్ తదితరులను ఉపాధ్యాయులు అభినందించారు.

'టోల్' నుంచి మినహాయింపు ఇవ్వాలి



ఎస్ఐ రాజశేఖర్‌కు సమస్యను వివరిస్తున్న వాహనదారులు

రొళ్ల: జాతీయ రహదారి 544–ఈపై రొళ్లకొండ సమీపాన ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాలో స్థానికులకు ఫీజులో మినహాయింపు ఇవ్వాలని వివిధ గ్రామాల వాహనదారులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కమర్షియల్, నాన్ కమర్షియల్ వాహనదారులు, వివిధ వాహనాల యజమానులు మంగళవారం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఎస్ఐ రాజశేఖర్‌కు సమస్యను వివరించారు. టోల్‌ప్లాజాకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు వివిధ పనుల నిమిత్తం నిత్యం నాలుగు, ఆరు చక్రాల వాహనాలతో రొళ్ల, మడకశిరకు వెళ్తుంటారని, ప్రతిసారి టోల్‌ప్లాజా వద్ద ఫీజులు చెల్లించడం ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో ఎస్ఐ రాజశేఖర్ టోల్‌ప్లాజా సిబ్బందితో మాట్లాడారు. స్థానికంగా తిరిగే కార్లు, జీపులు, బొలెరో వంటి వాహనాలకు రోజూ కాకుండా నెలకు రూ.1,000, లైట్ కమర్షియల్ వాహనాలకు నెలకు రూ.1,470, హెవీ కమర్షియల్ వాహనాలకు నెలకు రూ.4,000 ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు. దీంతో ఎస్ఐ ఇదే విషయాన్ని వాహనదారులకు తెలియజేశారు.

వాహనదారుడిపై టోల్‌ప్లాజ్ సిబ్బంది దాడి

కాగా రొళ్ల సమీపంలోని గ్రామానికి చెందిన ఓ వాహన దారుడు మంగళవారం వివిధ పనుల నిమిత్తం తన ఫోర్‌వీలర్‌తో మూడు నాలుగుసార్లు టోల్‌ప్లాజా దాటాడు. నాలుగుసార్లూ సిబ్బంది టోల్ వసూలు చేయడంతో కేవలం రెండు, మూడు కి.మీ కూడా టోల్ వసూలు దారుణమని వాహనదారుడు సిబ్బందిని ప్రశ్నించాడు. మాటామాటా పెరగడంతో టోల్‌ప్లాజ్ సిబ్బంది వాహనదారుడిపై దాడికి దిగారు. నూతనంగా ఏర్పాటు చేసిన రొళ్లకొండ టోల్‌ప్లాజా వద్ద నిత్యం స్థానికులు, టోల్‌ప్లాజా సిబ్బంది గొడవలు జరుగుతున్నాయని, దీన్ని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

సోమందేపల్లి: పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం నల్లగొండరాయనిపల్లికి చెందిన రామ్‌గోపాల్ (48)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయంతో పాటు పాడి పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం పశువులను మేపు కోసం అటవీ ప్రాంతానికి తోలుకెళ్లిన రామ్‌గోపాల్‌ను పాము కాటు వేసింది. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో సాయం అందక అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆలస్యంగా అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు విషయాన్ని గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బాధితుడిని వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా... లారీని బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 25 మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు...

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- మరో 25 మందికి స్వల్ప గాయాలు

తనకల్లు: మండలంలోని నారేవాండ్లపల్లి వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... నల్లమాడ, ఓడీ చెరువు, తనకల్లు మండలాలకు చెందిన పలువురు కూలీలు అన్నమయ్య జిల్లా మొలకలచెరువులోని ఓ మండిలో టమాటలను గ్రేడింగ్ పనికి వెళుతుంటారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున పని ముగించుకుని బొలెరో వాహనంలో స్వగ్రామాలకు బయలుదేరిన వారు... తనకల్లు మండలం నారేవాండ్లపల్లి మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన బైక్‌ను బొలెరో డ్రైవర్ తప్పించబోయి సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీని బలంగా ఢీ కొన్నాడు. దీంతో బొలెరో వాహనంలో ఉన్న కూలీలు ఎగిరి రోడ్డుపై పడ్డారు. నల్లమాడ మండలం గూడుమేకలపల్లికి చెందిన శంకరప్ప (47) అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లమాడ మండలం బొగ్గిటివారిపల్లికి చెందిన గంగాద్రి, రమాదేవి, రాధ, రమణానాయక్, మోహన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు మరో 25 మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను చికిత్స కోసం తనకల్లుకు అక్కడి నుంచి కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గంగాద్రి, రమాదేవి, రాధ, రమణానాయక్, మోహన్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై ఎస్ఐ ధరణిబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లేపాక్షి: మండలంలోని మద్దిపి గ్రామానికి చెందిన రామాంజినప్ప (45) ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం కంచిసముద్రంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన ఆయన మార్గం మధ్యలో మలుపు వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో వాహనం అదుపు తప్పి కిందపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామాంజినప్పను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా లేపాక్షిలోని పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, మృతుడికి భార్య గంగరత్నమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



తనకల్లు: మృతి చెందిన శంకరప్ప

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి(35) ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. వ్యవసాయంతో పాటు బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. సోమవారం రాత్రి ఎన్ఎస్‌గేట్‌కు వెళ్లిన ఆయన పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరి స్వగ్రామం శివారులోకి చేరుకోగానే వేగ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఉన్న పల్లంలోకి దూసుకెళ్లాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. కాగా, ఆయనకు భార్య సోనియా ఉన్నారు. ఘటనపై సీకేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.